సాక్షి
ములుగు
శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



ములుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జంపన్నవాగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ..

'సద్దుల' సంబురం

జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు



జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో గురువారం సాయంత్రం మహిళలు, యువతులు, చిన్నారులు దేవాలయాలు, చెరువులు, కుంటల వద్దకు చేరుకుని ఆడి పాడారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుని నిమజ్జనం చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై కళాకారులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తోపుకుంట వద్దకు ఎక్కువ మంది మహిళలు బతుకమ్మలతో తరలిరావడంతో పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అందరూ చూసే విధంగా అధికారులు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పోలీసులు మదనపల్లి, అన్నంపల్లి, దేవగిరిపట్నం, పత్తిపల్లి, చిన్నగుంటూరుపల్లి, జగ్గన్నపేట గ్రామాలకు వైపునకు వెళ్లే వాహనాలను బారికేడ్లతో నిలిపివేశారు. దీంతో వాహనదారులు ఎన్నో అవస్థలు పడి స్వగ్రామాలకు చేరుకున్నారు. పలుచోట్ల కొద్దిసేపు కురిసిన వర్షంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. – ములుగు



బతుకమ్మలతో తోపుకుంటకు వస్తున్న మహిళలు



వెంకటాపురం(కె): బతుకమ్మను తీరొక్క పూలతో పేరుస్తూ..



ఏటూరునాగారంలోని రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మంగపేట: కమలాపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మరిన్ని ఫొటోలు - III, IVలో

న్యూస్‌రీల్

రావణవధకు ఆహ్వానం



ములుగు: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రావణ వధ కార్యక్రమానికి హాజరుకావాలని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ భాస్కర్‌లకు ఆహ్వాన పత్రిక అందజేశారు.. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గంద్రకోట కుమార్ మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లూరి మహేందర్, గందె రాజు, గుగ్గిళ్ల సృజన్‌కుమార్, అనుముల సురేష్, శ్రీహరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ప్రయోగశాలలు



ఏటూరునాగారం: గ్రంథాలయాలు నిరుద్యోగులకు ప్రయోగశాలలని ఆశయం గ్రంథాలయ నిర్మాణ కర్త, కానిస్టేబుల్ దూపటి సతీష్ అన్నారు. మండల పరిధిలోని చిన్నబోయినపల్లిలో సతీష్ నిర్మించిన గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి ఇటీవల డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన అఖిల్‌ను గ్రామస్తులతో కలిసి సతీష్ గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకే గ్రంథాలయాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. సొంత డబ్బులతో నిర్మించిన గ్రంథాలయంలో పుస్తకాలను చదివి ఎంతోమంది ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగు: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఈ క్రమంలో ఇద్దరికి గాయాలైన సంఘటన జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన మంకిడి రాజాబాబు ములుగు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో జంగాలపల్లి నుంచి ద్విచక్రవాహనంపై ముగ్గురు కార్మికులు ములుగు వైపు వస్తుండగా డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా రాజాబాబుతో పాటు ఓ కార్మికుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇరువురిని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రణాళిక శాఖ పుస్తకావిష్కరణ



భూపాలపల్లి అర్బన్: ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం–2024 పుస్తకాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. వ్యవసాయం, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్‌తో సహా విభిన్న రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితి, రాష్ట్రం వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను తెలియచేస్తూ ప్రణాళికా శాఖ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. సమగ్ర సమాచారంతో పుస్తక రూపకల్పనలో భాగస్వాములైన అన్ని విభాగాల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన

గణపురం: మైలారం వద్ద శుక్రవారం జరుగనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన పనులను గురువారం రాత్రి కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. శంకుస్థాపనకు భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

మానసిక సమస్యను మొదట్లోనే గుర్తించాలి

డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య

ములుగు: మానసిక ఆరోగ్య సమస్యను మొదట్లోనే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు తొలిదశలో చికిత్స అందించి నయం చేయవచ్చని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. తెలంగాణ కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ అప్పయ్య మాట్లాడుతూ మానసిక రోగులు ఎక్కువగా నిద్రపోవడం, ఆల్కహాల్, మత్తుపదార్థాలకు బానిస కావడం, అనుకోకుండా కోపాన్ని ప్రదర్శించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి వారు వారి భావాలను మరొకరితో పంచుకోవడం, శారీరక శ్రమ చేయడం, యోగా చేయడంతో పాటు మంచి ఆహారం తీసుకోవడం, ఒంటరిగా కాకుండా అందరిమధ్యలో ఉండడం ద్వారా ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణాధికారి పవన్, సైకియాట్రిస్ట్ నమ్రత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

కారుణ్య నియామక పత్రాల అందజేత

భూపాలపల్లి అర్బన్: కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులకు గురువారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ నియామక పత్రాలు అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పత్రాలు అందజేసిన అనంతరం జీఎం మాట్లాడారు. సంస్థలో ఉద్యోగంలో చేరే కార్మికులు అంకితభావంతో పనిచేయాలన్నారు. సంస్థను మరింత లాభాల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కవీంద్ర, మారుతి, రాజు, క్రాంతికుమార్, రాంచందర్, బుచ్చయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అమ్మవారు

ఏటూరునాగారం: సాయిబాబా ఆలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



మంగపేట: తిమ్మంపేటలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఏటూరునాగారం: దుర్గాదేవిగా అమ్మవారు



ఏటూరునాగారం/మంగపేట: ఏటూరునాగారం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. కోరిన కోర్కెలను తీర్చాలని మహిళలు అమ్మవారికి ఒడి బియ్యాన్ని సమర్పించి గాజులతో అలంకరించారు. అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం ఒడి బియ్యాన్ని అమ్మవారికి సమర్పించారు. అదేవిధంగా సాయిబాబా ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, శివాలయం, ముత్యాలమ్మ గుడి, క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ముస్తాబు చేశారు. నిమ్మకాయ మాలలు, పూలు, గాజులు, తీరొక్క రంగుల చీరెలతో అలంకరించి దూపం దీపం నైవేద్యాలను సమర్పించారు. భవాని స్వాముల అమ్మవారి నామస్మరణతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. అదే విధంగా మంగపేటలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో అర్చకులు విస్సావజ్ఝల నరేష్‌శర్మ ఉమాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిమను దుర్గాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని తిమ్మంపేట, రాజుపేట, రమణక్కపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లిలో అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల భక్తమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మంగపేటలోని రమణక్కపేటలో..

ఎంపికలో ఏమరుపాటు!

నోటిఫికేషన్ ఇచ్చి మరిచిన నియామకాలు

- ఆరు నెలలు గడుస్తున్నా అందని ఉత్తర్వులు
- దళారులకు వరంగా మారుతున్న ఆలస్యం
- అర్హుల ఎదురుచూపులు



ఎంజీఎం: నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగ నియామకాల భర్తీని నిర్లక్ష్యం వెంటాడుతోంది. హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 31 పోస్టుల భర్తీకి మార్చిలో అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కానీ ఎంపిక ప్రక్రియ పూర్తి చేయకపోవడంపై నిరుద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాంట్రాక్టు పద్ధతిన ఈ పోస్టుల్ని నింపేందుకు మార్చిలో ఒకటో తేదీ నుంచి 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి 11వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి ఎంపిక పూర్తి చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసి ఆరు నెలలు గడుస్తున్నా.. ఎంపిక చేయకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వందల సంఖ్యలో దరఖాస్తులు..

వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంత అసక్తి చూపుతారో.. నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు పొందేందుకు సైతం అభ్యర్థులు అదే తరహాలో పోటీపడతారు. హనుమకొండ జిల్లాలో మార్చిలో నాలుగు ఎంఎల్‌హెచ్‌పీ, ఐడీఎస్‌పీ విభాగంలో రెండు పోస్టులు, 13 స్టాఫ్ నర్సు, ఐదు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఎసీఎస్ఎం కో–ఆర్డినేటర్, యూపీహెచ్‌సీ విభాగంలో రెండు స్టాఫ్ నర్సుల పోస్టులకు, ఒక క్వాలిటీ మేనేజర్, ఒక ఫార్మసిస్టుతో కలిసి మొత్తం 31 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించగా.. వందలాది మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు.

దళారుల బేరసారాలు..

ఉద్యోగాల భర్తీ ఆలస్యం దళారులకు వరంగా మారుతోంది. మెరిట్ లిస్ట్ ద్వారా ఎవరికి ఉద్యోగం వస్తుందనే విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది సహకారంతో తెలుసుకుంటున్న దళారులు స్వయంగా మెరిట్ ఉన్న అభ్యర్థులకు ఫోన్ కాల్ చేసి మీ జాబ్ కన్ఫామ్.. కాకపోతే ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందంటూ బేరసారాలకు దిగుతున్నారు. ఎంపికయ్యే అభ్యర్థుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచాల్సిన సిబ్బంది వారి జేబులు నింపుకునేందుకు నానా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎంపిక ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారు.

మొదలైన వివాదాలు..

మార్చి 11వ తేదీ వరకే కౌన్సెలింగ్ నిర్వహించి ఎంపిక పూర్తి చేస్తామన్న అధికారులు నియామకాల ప్రక్రియను ఆలస్యం చేయడం దళారులకు వరంగా మారుతోంది. ఈ ప్రక్రియలో మెరిట్ లిస్ట్ తయారు చేసిన అనంతరం అసలు వివాదం మొదలైంది. ఎంపిక ప్రక్రియలో తప్పులు దొర్లాయని పేర్కొంటూ.. పలువురు అభ్యర్థులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎంపిక ప్రక్రియ వాయిదా పడింది. అభ్యర్థుల వివరాలను నమోదు చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పని చేస్తున్న చాకచాక్యంగా వ్యవహరించి తప్పుగా నమోదు చేసి మెరిట్ జాబితాలో అవకవతకలు జరిగేందుకు శ్రీకారం చుట్టారని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఈఘటనతో కలెక్టర్ మెరిట్ లిస్టును మరోసారి తయారు చేయాలని ఆదేశించారు. దీంతో ఆ ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాలేదు.

పది రోజుల్లో పూర్తి చేస్తాం..

కొన్ని రోజుల క్రితమే హనుమకొండ వైద్య ఆరోగ్యశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. నియామకాల భర్తీ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయంలో పారదర్శకంగా మరోమారు మెరిట్ లిస్ట్ తయారు చేస్తున్నాం. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రక్రియ చేపడుతాం. అభ్యర్థులు ఎవరి మాయమాటలకు తలొగ్గొద్దు.

– లలితాదేవి, డీఎంహెచ్ఓ

కుల వృత్తులకు అండగా సర్కారు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- గౌడన్నలకు కాటమయ్య రక్షా కిట్ల పంపిణీ



కాటమయ్య రక్షా కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ ప్రజా పాలనలో వృత్తి ఆధారిత కుటుంబాలకు అండగా ఉంటున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్)లో గురువారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గౌడన్నలకు కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పండుగ వేళ గౌడన్నలకు రక్షా కిట్లను తన చేతుల మీదుగా అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్ గీత వృత్తిలో ప్రాణాపాయ స్థితులనుంచి కాపాడుతుందన్నారు. జిల్లా కేంద్రంలో త్వరలో గౌడ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, జిల్లా అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా వెనుకబడిన శాఖ అధికారి రాంరెడ్డి, గౌడ సంఘం నేతలు, ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పట్నం బదిలీ ప్రయాసేనా?

కొనసాగుతున్న సంప్రదింపులు
- ఎన్పీడీసీఎల్ సీఎండీ సీరియస్
- బదిలీల ప్రక్రియను ముగించాలని ఆదేశాలు



హన్మకొండ: బదిలీల్లో నిబంధనలకు పాతర వేశారని విద్యుత్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రధానంగా కొందరికి ప్రస్తుతం పని చేస్తున్న నగర ప్రాంతంలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని చూస్తుండడంపై నగరం అవతల పని చేస్తున్న ఉద్యోగులు మండిపడుతున్నారు. ఏళ్లుగా వరంగల్ మహా నగరంలోని ఎన్పీడీసీఎల్‌కు చెందిన వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్నారని, వరంగల్ మహానగరం అవతల పని చేస్తున్న వారికి నగరానికి వచ్చేందుకు ఏ మాత్రం అవకాశం కల్పించడం లేదని మండిపడుతున్నారు. సిటీకి దూరంగా పని చేస్తున్న మహిళలు తమకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. సిటీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు అదే సిటీలో ఎక్కడో ఒక చోట పోస్టింగ్‌లు ఇస్తూ తమకు రావాల్సిన అవకాశాలను కొల్లగొడుతున్నారని.. తాము ఎంత కాలం దూర ప్రాంతాల్లో పని చేయాలని వారంతా ప్రశ్నిస్తున్నారు.

మినహాయింపు..

ఉద్యోగులు స్వయంగా కానీ.. ఉద్యోగి స్పౌజ్, పిల్లలు, ఉద్యోగిపై ఆధారపడిన తల్లిదండ్రులు అనారోగ్యానికి గురైతే వారికి బదిలీల్లో నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ వ్యాధులు ఉన్న వారికి బదిలీల్లో మినహాయింపు ఇచ్చారు. దీంతో పాటు ప్రొటెక్షన్, స్పౌజ్, 70శాతం వికలాంగత్వం, వితంతువులకు సడలింపు ఉంది. ఈ మినహాయింపులు వర్తించని వారిని కూడా జిల్లా కేంద్రంలోనే బదిలీలు చేయబోతున్నట్లు, అవకాశం రాని విద్యుత్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల ఉత్తర్వులు వెలువడకున్నా ఎవరు ఎక్కడికి వెళ్తున్నారో ముందుగానే తెలియడంతో అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు బదిలీలు వివాదాస్పదం కావొద్దనే అధికారులు ముందుగానే.. యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరిపారు. కొన్ని సర్కిళ్లలో కొన్ని యూనియన్లను విస్మరించడంతో బదిలీల ప్రక్రియలో వివాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో కొన్ని సర్కిళ్లు, కొన్ని డివిజన్లలో సంప్రదింపులు కొలిక్కి రాకపోవడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో పని చేస్తున్న వారు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని నిబంధన ఉన్నా.. అవేమీ పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.

ఉత్తర్వులకు కట్టుబడి ఉండాలి: సీఎండీ

7వ తేదీ నాటి బదిలీల ఉత్తర్వులకు కట్టుబడి ఉండాలని ఆదేశాలిచ్చామని కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులను లేని పోని ఆశలకు గురి చేయొద్దని ఎస్‌ఈలను ఆదేశిస్తూ సీఎండీ మెసేజ్ పంపినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తామని, ఉత్తర్వుల్లో మార్పులకు అవకాశం లేదని ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాలకు స్పష్టంగా చెప్పాలని సీఎండీ మెసేజ్‌లో ఆదేశించినట్లు తెలిసింది. కాగా.. సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో పరిస్థితులు మరో రకంగా ఉన్నాయి. బదిలీ నోటిఫికేషన్లలో పేర్కొన్న నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు రోజులు దాటినా.. ముగియని ప్రక్రియ!

ఈనెల 7వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియ ముగియాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ వివిధ కారణాలతో తాత్కాలికంగా వాయిదా పడింది. అయినా 7వ తేదీ నాటికి ఏ ఉద్యోగిని ఏ స్థానానికి పంపాలో ఉత్తర్వులు సిద్ధం చేయాలి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో వరంగల్ సర్కిల్‌తో పాటు మరికొన్ని సర్కిళ్లు, డివిజన్లలో ఇంకా యూనియన్లు, అసోషియేషన్లతో అధికారులు సంప్రదింపులు జరుపుతుండడం వివాదాస్పదమవుతోంది. 7వ తేదీ నాడే బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాల్సి వస్తే వీరి పరిస్థితి ఏంటనేది ఆ అధికారులకే తెలియాలి. ఆ తర్వాత మూడు రోజులు దాటినా.. ఇంకా బదిలీల ప్రక్రియ పూర్తి చేయకపోవడంపై అధికారుల తీరుపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

దసరా బంపరాఫర్

వందకొట్టు.. పొట్టేలు పట్టు
- 10 కన్సోలేషన్ బహుమతుల కింద మద్యం బాటిళ్లు, కోడిపుంజు
- వెలికట్టలో వినూత్న లక్కీ డీప్..



వెలికట్టలో లక్కీ డీప్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తొర్రూరు రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని తొర్రూరు మండలం వెలికట్టలో వినూత్నంగా లక్కీ డీప్‌ను ప్రారంభించారు. గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో 'వంద రూపాయలు కొట్టు.. పొట్టేలు పట్టు' అంటూ గురువారం కూపన్లు అమ్మడం ప్రారంభించారు. దసరా రోజు మాంసాహారాన్ని ఇష్టంగా తినేవాళ్లకు గొర్రె, మేకపోతులు, నాటుకోళ్లు, మద్యం అందించేలా లక్కీ డీప్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రూ.100కు ఒక కూపన్ విక్రయిస్తున్నారు. వెయ్యి కూపన్లు విక్రయించి అందులో మొదటి బహుమతిగా గొర్రె పోతు, రెండో బహుమతిగా మేకపోతుతోపాటు మరో పది కన్సోలేషన్ బహుమతులు.. నాటుకోడి పుంజు, పెట్ట, ఒక్కో రకం మద్యం ఫుల్ బాటిళ్లను అందించనున్నారు. గ్రామంలోని అన్నివర్గాల ప్రజలు లక్కీ డ్రాలో పాల్గొని తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని యువజన సంఘం నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు.

రెండేళ్ల బాలుడి ఊపిరితిత్తిలో పల్లిగింజ

- బ్రాంకోస్కోపీ ద్వారా తొలగించిన ఎంజీఎం వైద్యులు



శస్త్ర చికిత్స ద్వారా వెలికి తీసిన వేరుశనగ గింజ



బ్రాంకోస్కోపీ శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

ఎంజీఎం : ఓ బాలుడి ఊపిరితిత్తిలో చేరిన పల్లిగింజ(వేరుశనగ)ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు బ్రాంకోస్కోపీ శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. బాలుడి ప్రాణం కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి గురువారం ఆ శస్త్రచికిత్స వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఎండీ సర్దాం హుస్సేన్ అనే రెండేళ్ల బాలుడు వారం రోజులనుంచి దగ్గు, ఆయాసంతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. సిటి స్కాన్ చేసి చూడగా.. కుడి ఊపిరితిత్తిలో వేరుశనగ గింజ ఉన్నట్లు గుర్తించారు. ఆ గింజను బ్రాంకోస్కోపీ పద్ధతిలో శస్త్ర చికిత్స చేసి తొలగించారు. డాక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈఎన్‌టీ బృందం వైద్యులు జాషువా, రాంలాల్, అనస్తీషియా బృందం సహకారంతో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ మురళి తెలిపారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వోపా నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (వోపా) ఆధ్వర్యంలో హనుమకొండలోని టీఎన్జీఓస్ భవన్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో పాటు జాతి ప్రముఖులకు సత్కార కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వోపా సలహాదారుడు చొల్లేటి కృష్ణమాచార్యులు ముఖ్య అతిథిగా హాజరై పదో తరగతిలో రాష్ట్రంలోనే మొదటి పది ర్యాంకుల్లో ముందు నిలిచిన మడుపోజు భువనకృతితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మరో పది మంది విద్యార్థులను సత్కరించారు. అనంతరం 80 ఏళ్లు నిండిన దంపతులను సహస్ర చంద్ర సందర్శకులుగా గుర్తించి సత్కరించారు. కార్యక్రమంలో వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారులు, మట్టెవాడ విజయ్‌కుమార్, డాక్టర్ కురివి జగన్మోహనాచారి, కత్రోజు లింగాచారి, బొల్లోజు బ్రహ్మాచారి, వీణవంక రాజేశ్వర్, మహారాజ భరత్, పాడిచెట్టి విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో ఫ్లెక్సీల వివాదం



ఘర్షణకు దిగిన వారిని చెదరగొడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ
- తీవ్ర ఉద్రిక్తత, పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ

నల్లబెల్లి: మండల కేంద్రంలో ఫ్లెక్సీల వివాదంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘర్షణకు దిగారు. ఇరు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆందోళన వద్దకు చేరుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సద్దుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విరివిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట ఉన్న ఫ్లెక్సీ సాయంత్రం కిందపడి ఉంది. ఫ్లెక్సీ సమీపంలో తాగి పడేసిన బీరుబాటిళ్లు ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించిన బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీని కాంగ్రెస్ కార్యకర్తలే చింపేశారని భావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని ఘర్షనకు దిగారు. ఫ్లెక్సీని కాంగ్రెస్ నాయకులు చింపలేదని తేల్చిచెప్పారు. ఈక్రమంలో ఇరు పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సాయి రమణ, ఎస్సై ప్రశాంత్ బాబు రంగంలోకి దిగి ఇరు పార్టీలను సముదాయించారు. వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఘటనా స్థలికి చేరుకున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. ఉత్సవాల సమయాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పండుగపూట విషాదం

- చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



గోదావరి వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చక్రపాణి, తదితరులు

కాళేశ్వరం: సద్దుల బతుకమ్మ పండుగ పూట పలుగుల గ్రామంలో విషాదం నెలకొంది. చేపల వేటకు వెళ్లి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన పసుల మల్లయ్య(43) గురువారం గోదావరిలో మునిగి మృతి చెందాడు. మల్లయ్య బుధవారం చేపల కోసమని గ్రామ సమీపంలోని గోదావరికి వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. గురువారం మధ్యాహ్నం గోదావరి తీర ప్రాంతంలో వెతుకుతుండగా.. గోదావరిలో తేలుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న కాళేశ్వరం ఎస్సై చక్రపాణి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్లయ్య మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య అమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో రికార్డుల తనిఖీ



కాశీవిశ్వేశ్వరాలయంలో తనిఖీలు చేస్తున్న ఎండోమెంట్ అధికారులు

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని చారిత్రక శ్రీ కాశీవిశ్వేశ్వర, రంగనాథస్వామి దేవాలయ రికార్డులను గురువారం ఎండోమెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కాశిబుగ్గలోని రెండు ఆలయాలను ఎండోమెంట్ పరిధిలోకి వచ్చే విధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఎండోమెంట్ అధికారులు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గురువారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది మహేశ్ ఆలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కమిటీ సభ్యులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. బుధవారం రాత్రి కాశిబుగ్గ వాట్సాప్ గ్రూపులలో దేవాలయానికి చెందిన విలువైన వస్తువులు మాయమయ్యాయని కొందరు వైరల్ చేయడంతో గురువారం ఎండోమెంట్ అధికారులు తనిఖీలకు వచ్చారని పలువురు పేర్కొనడం గమనార్హం.

గోవుల అక్రమ తరలింపు.. అడ్డగింత

వరంగల్: నగరంలోని గిర్మాజీపేట చార్‌బౌళి ప్రాంతంలో గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో భజరంగ్‌దళ్ కార్యకర్తలు గురువారం అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో అక్కడున్న మరో వర్గం యువకులకు, భజరంగ్‌దళ్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో ఆ వర్గం యువకులు భజరంగ్ కార్యకర్తలపై దాడి చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం ఇంతేజార్ గంజ్ పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని అక్కడున్న ఆవులను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందిడంతో వాటిని రక్షించేందుకు వెళ్లిన తమపై ఓ వర్గం యువకులు తమపై దాడికి పాల్పడినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈవిషయంపై ఇన్‌స్పెక్టర్ షుకుర్‌ను వివరణ కోరగా.. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సమస్యను పరిష్కరించామని, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి

- కరెంట్‌షాక్‌తో రైతు మృతి



యాకయ్య(ఫైల్)

నెక్కొండ: సద్దుల బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. అలంకానిపేటకు చెందిన రైతు చీకటి యాకయ్య(43) కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. యాకయ్య ఊర చెరువు వద్ద బతుకమ్మ వేడుకలు చూసేందుకు తన మనవడిని ఎత్తుకొని గురువారం సాయంత్రం వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను తప్పించుకునే క్రమంలో కాలుజారి పడబోయాడు. ఈక్రమంలో వేడుకల కోసం ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల తీగను పట్టుకున్నాడు. దీంతో యాకయ్య ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నెక్కొండకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. యాకయ్య మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నాణ్యత పేరిట మోసం

- రూ.25 లక్షలు ఎగనామం పెట్టిన వ్యాపారి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మహబూబాబాద్ రూరల్: నాణ్యత పేరిట మోసం చేసి.. తక్కువ ధర పలికే మిర్చిని ఎక్కువ ధరకు విక్రయించి రూ.25 లక్షలకు ఎగనామం పెట్టాడో వ్యాపారి. ఈఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మిర్చి వ్యాపారి వద్ద ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణానికి చెందిన పలువురు మిర్చి వ్యాపారులు పదిహేను రోజుల క్రితం మిర్చి కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈక్రమంలో వారు 1,300 పైచిలుకు మిర్చి బస్తాల కోసం రూ.25 లక్షల నగదును మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారికి అప్పగించారు. కాగా.. సదరు వ్యాపారి తాను ఒప్పుకున్నట్లుగా మిర్చి బస్తాలను వారికి పంపించాడు. కానీ.. అందులోని సరుకు తక్కువ నాణ్యత (రెండేళ్ల కిందటి లో క్వాలిటీ సరుకు) కలిగి ఉంది. ఇలా ఎందుకు చేశావని గుంటూరుకు చెందిన వ్యాపారులు మానుకోట వ్యాపారిని ప్రశ్నించగా.. అతడు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసంపై మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

నెల్లికుదురు: మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల ఉమేశ్ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. 5 తులాల బంగారం, రూ.30 వేలు నగదును ఎత్తుకెళ్లారు. ఈనెల 9న ఉమేశ్ తమ్ముడు అన్నారం షరీఫ్‌లో చేసిన శుభకార్యానికి కుటుంబం అందరూ వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేవరకు తాళం పగులగొట్టి బీరువా తెరిచి ఉంది. బీరువాలోని 5 తులాల బంగారం, 30 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి ఉమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహన ఫైనాన్స్ పేరిట దోపిడీ

- అధిక వడ్డీ.. బెదిరించి వసూళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- వాహనాలు లాక్కెళ్తున్న ఏజెంట్లు

ఖిలా వరంగల్: పదివేలు చెల్లించండి.. పది లక్షల కారు, బైకును తీసుకెళ్లండి. నెలసరి వాయిదాల్లో మీకు ఎంత వీలైతే అంత కట్టుకోండి అంటూ ఆఫర్లతో ఊరిస్తున్నారు. ఆ తర్వాత ఫైనాన్స్‌లో వాహనాలు తీసుకుంటే అంతే సంగతి. ఉద్యోగం ఊడిపోయి, డబ్బు సమయానికి రాక కిస్తీ చెల్లించడం ఆలస్యమైతే ఫైనాన్స్ కంపెనీలతో టార్చర్ మొదలవుతుంది. ఫైనాన్స్ కంపెనీ కిస్తీలు వసూలు చేసే సిబ్బంది నడిరోడ్డుపై నిలబెట్టి పరువు తీస్తారు. గుమ్మాల్లో తిష్ట వేస్తారు. వారి లెక్కల ప్రకారం వడ్డీకి వడ్డి ఇలా చెల్లించకపోతే వాహనాన్ని లాక్కెళ్తారు. ఇలా వరంగల్ నగరంలో ఎంతో మంది నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.

మర్యాద.. దుర్భాష!

వాహనం కొంటున్నప్పుడు ఫైనాన్స్ ఇచ్చే సమయంలో సిబ్బంది మర్యాదలు మామూలుగా ఉండవు. టీ, కాఫీలు. సార్ అంటూ సంబోధనలు. వాయిదాలు చెల్లించే క్రమంలో ఏ కాస్త లేటయినా అసలు స్వరూపం చూపిస్తారు. చుట్టుపక్కల వాళ్లు చూస్తున్నా రోడ్డుపైనే దుర్భాషలాడతారు. కాగా.. వెహికిల్ ఆన్‌రోడ్ ప్రైస్ ఒక ధర ఉంటే.. ఫైనాన్స్ అని షోరూమ్ వారికి చెబితే చాలు వెహికిల్ ధరను అమాంతం పెంచేస్తారు. ఇలా నగదుతో కొనేవారి కంటే.. ఫైనాన్స్ తీసుకునేవారికి రూ.25 వేల వరకు ధరల్లో వ్యత్యాసం ఉంటోందని వాహనకొనుగోదారులు ఆవేదన చెందుతున్నారు. ఇష్టారీతిన కంటికి కనిపించని అక్షరాలతో 'షరతులు వర్తిస్తాయి' అంటూ అగ్రిమెంట్ ఫైల్ మీద సంతకాలు చేయించుకుంటారు. ఇలా దాదాపు 30 వరకు సంతకాలు చేయాల్సి ఉంటుంది. నూటికి 90శాతం మంది అవేమీ చదవకుండానే సంతకాలు చేస్తున్నారు. ఆతర్వాత నెలసరి వాయిదాలు చెల్లించే సమయంలో అధిక వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్లియరెన్స్ ఎలా?

వరుసగా వాయిదాలు చెల్లిస్తే సరేసరి. లేదంటే ఒక్క రోజు ఆలస్యమైతే రోజుల్ని బట్టి వడ్డీ పెరుగుతుంది. రెండు మూడు నెలలు వాయిదాలు చెల్లించకపోతే సిబ్బంది వెహికిల్ లాక్కెళ్తారు. చాలా కంపెనీలు వాయిదాలు చెల్లించినప్పటికీ కస్టమర్లకు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఏదో ఒక నిబంధనను చూపి ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులు క్లియరెన్స్ అడ్డుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఇలా వారు 25 నుంచి 30 శాతం వరకు వడ్డీలు వసూలు చేస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు.

వరంగల్ నాగమయ్య కాలనీకి చెందిన రాజేశ్వర్ ప్రభుత్వ ఉద్యోగి నాలుగేళ్ల క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో కారు కొన్నాడు. ఆర్నెళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలల పాటు నెలవారీ కిస్తీలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ ఉద్యోగులు అతడిని బెదిరించి దౌర్జన్యంగా కారును తీసుకెళ్లారు. ఫైనాన్స్ కంపెనీ వారు నెలలోపు నోటీసులు జారీ చేసి కారును వేలంలో అమ్మేసి ఫైనాన్స్‌కు చెల్లించాల్సిన డబ్బులు జమ చేసుకున్నారు.

వరంగల్‌కు చెందిన శ్రీనివాస్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. ఐదేళ్ల క్రితం ఫైనాన్స్‌లో కారును కొన్నాడు. నెలవారీ కిస్తీలు చెల్లిస్తున్నాడు. ఆరోగ్య పరిస్థితులు బాగాలేక నెలవారీ కిస్తీలు చెల్లించలేదు. ఫైనాన్స్ ఉద్యోగులు ఇంటికొచ్చి దుర్భాషలాడుతూ కారును ఫైనాన్స్ గోదాంకి తీసుకెళ్లి విక్రయించారు.



వరంగల్ నగరంలోని ఓ బైక్ షోరూం..



यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

దేవరుప్పల శాఖ (శాఖ కోడ్: 801208)

స్వాధీనతా ప్రకటన

రిఫరెన్స్ నెం.012030100103960

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారముల వినియోగించుకొని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **07-05-2024** తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసి, సదరు నోటీస్ అందిన తేదీ నుండి 60 రోజుల లోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ.13,68,966.41 (పదమూడు లక్షల అరవై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై ఆరు రూపాయల నలభై ఒక్క పైసలు)** మాత్రమే తిరిగి చెల్లించాలని రుణగ్రహీత 1) దరఖాస్తుదారు: **శ్రీమతి పల్లపు యాదమ్మ, భర్త: యాదయ్య,** నివాసం: ఇ.నెం. 4-64/3, గ్రామం: బండ కొత్తపల్లి, గుండాల, జిల్లా: జనగామ (పాత నల్గొండ), తెలంగాణ-506302, మరియు 2) సహ-దరఖాస్తుదారు **శ్రీ పల్లపు యాదయ్య, తండ్రి: హనుమంతు,** నివాసం: ఇ.నెం.4-61/3, గ్రామం: బండ కొత్తపల్లి, గుండాల, జిల్లా: జనగామ (పాత నల్గొండ), తెలంగాణ-506302 వారిని కోరారు.

రుణ గ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **10-09-2024**న స్వాధీనం చేసుకున్నారని రుణ గ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియచేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీ చేయరాదని మరియు సదరు ఆస్తితో చేసే ఏదేని లావాదేవీ అయినా మొత్తం **రూ.13,68,966.41 (పదమూడు లక్షల అరవై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై ఆరు రూపాయల నలభై ఒక్క పైసలు)** మాత్రమే మరియు దానిపై వడ్డీ కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జికి లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లో సబ్-సెక్షన్(8) నిబంధనలను గమనించాలని రుణగ్రహీతను కోరడమైనది.

స్థిరాస్తి వివరణ

1) రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా జనగామ మరియు జిల్లా జనగామలోని, శ్రీమతి పల్లపు యాదమ్మ, భర్త యాదయ్య పేరున ఉన్న, తెలంగాణ-506302, జిల్లా జనగామ, గ్రామం దేవరుప్పుల, సర్వే నెం.768/బి వద్ద గల 100.00 చ.గజాల విస్తీర్ణం కలిగిన రెసిడెన్షియల్ ఏరియా ఆస్తి యావత్తు మరియు **సరిహద్దులు: ఉత్తరం:** 100 ఫీట్ల రోడ్, **దక్షిణం:** 20 ఫీట్ల రోడ్, **తూర్పు:** ఏం రవి ప్లాటు, **పడమర:** వనమాల శ్రీను ప్లాటు.

తేది: 05-10-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: దేవరుప్పుల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ కాకతీయ యూనివర్సిటీకి దగ్గరలో, JIO Point కి సమీపంలో నార్త్ ఈస్ట్ ఫేసింగ్‌లో గల G+1 ఇల్లు (221 Sq.Yards) అమ్మకానికి కలదు. సంప్ర॥ 8985947319. [W-1239919]

SERVICES

గొర్రె / గొర్రె పోతులు అమ్మకం

■ దేశవాళి గొర్రెపోతులు & గొర్రెలు కాపరివే పెంచబడినవి అమ్మకమునకు కలవు. గొర్రె పోతు లైవ్ 1కెజి. 460/-, గొర్రె (ఆడది) లైవ్ 1కెజి 400/- ఒగ్లాపూర్, దామెర మం॥ సంప్ర. 9030241156, 9121604262 [M-12175]

VEHICLE FOR SALE

■ 2023 Model AL DOST STRONG LS FSD BS6.II Registration No.TG25T0199 Vehicle For Sale. M/s. Indusind Bank Ltd. Cont: 9849594648, 9959455260. [W-1239920]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■ Pharmacy Boys (మందుల షాపు), O.T. Boys (ఆపరేషన్ థియేటర్), Supervisors (Administrators) & LAB Technicians కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM. [WA-0439]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663. [H-796283]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (డ్రోన్ చిత్రం)



బతుకమ్మతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

బతుకమ్మ పేరుస్తున్న మేయర్ గుండు సుధారాణి



బతుకమ్మ ఆడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



బతుకమ్మ ఆడిన వీఐపీలు

సద్దుల బతుకమ్మ సంబరాల్లో వీఐపీలు సందడి చేశారు. బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చెరువులు, కుంటలు, వాగులు, కాల్వల్లో నిమజ్జనం చేశారు.



బతుకమ్మ ఆడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



బతుకమ్మ పేరుస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సతీమణి



బతుకమ్మ పేరుస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ సతీమణి వాణి, కుటుంబ సభ్యులు

కుర్రకారు... డ్రైవింగ్ జోరు

- ఏడాది పొడువునా యువతీ, యువకులకు శిక్షణ
- కళకళలాడుతున్న డ్రైవింగ్ శిక్షణ స్కూళ్లు



కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న యువత

ఖిలా వరంగల్ : కుర్రకారు.. డ్రైవింగ్ జోరు మీద ఉంది. గతంలో ఇంటి ముందు సైకిల్ ఉంటేనే.. గొప్పగా భావించేవారు. తరువాత ద్విచక్రవాహనాలు కొనుగోలు చేస్తే ఆశ్చర్యంగా చూసేవారు. తాజాగా ఇంటి ముందు రెండు కార్లు పార్క్ చేస్తున్నారు. ప్రతి ఒక్కరి వ్యక్తి గత ఆదాయం పెరిగింది. దీంతో జీవితం ఆనందంగా గడుపుతున్నారు. దూర ప్రయాణాలు, ఇతర అవసరాలకు కార్లనే ఎంచుకుంటున్నారు. వీరి ఆసక్తికి అనుగుణంగా వివిధ మోడళ్లలో కార్లు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. అయితే కారు కొనలాంటే ముందు డ్రైవింగ్ నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏడాది పొడువునా యువతీ, యువకులు డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఫలితంగా డ్రైవింగ్ శిక్షణ స్కూళ్లు కళకళలాడుతున్నాయి.

యువతకు డ్రైవింగ్‌పై క్రేజ్..

మోటార్ వాహనాల చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వాహనం నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఇందుకు డ్రైవింగ్ శిక్షణ అవసరం. ఈ క్రమంలో ఇంత కాలం పురుషులే వాహనాలు డ్రైవింగ్ చేసేంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా డ్రైవింగ్ శిక్షణపై ఆసక్తిని కనబర్చుతున్నారు. గతంలో వేసవి సెలువుల్లో శిక్షణ తీసుకునేది. కార్ల వినియోగంపై యువత ఆసక్తి చూపడంతో ఏడాది పొడవునా డ్రైవింగ్ స్కూళ్లు కళకళలాడుతున్నాయి. ఇప్పుడు సమయం అంటు లేదు. ఎప్పుడు సమయం దొరికితే శిక్షణ పొందాల్సిందే. ఇంత కాలం కారు విలాస వస్తువుగా ఉండేది. కాల క్రమేణా అవసర వస్తువుగా మారింది. దీంతో కారు శిక్షణపై కుర్రకారుకు ఆసక్తి పెరిగిందని చెప్పొచ్చు.

డ్రైవింగ్‌పై ఆసక్తి ..

వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంతోపాటు శివనగర్, పుప్పాలగుట్ట, మండిబజార్, నర్సంపేట రోడ్డు, కాజీపేట, హనుమకొండ, కరీంనగర్ రహదారులపై డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. ఇంతకాలం డ్రైవింగ్ స్కూళ్లకు తక్కువమంది వచ్చేవారు. కాలానికి అనుగుణంగా కార్లను నడిపేందుకు యువతులు, యువకులు, మహిళలు మక్కువ చూపుతున్నారు. దీంతో వయసుతో భేదాభిప్రాయం లేకుండా డ్రైవింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు.

శిక్షణ తరగతులు ఇలా..

కారు డ్రైవింగ్ నేర్చుకునే వారికి రెండు రోజుల పాటు అవగాహన కల్పిస్తారు. బ్రేక్‌లు, క్లచ్‌లు, ఇంజిన్, స్పీడ్, సైడ్ లైట్స్, లాక్‌లు తదితర విషయాల గురించి తెలుపుతారు. మూడో రోజు నుంచి వాహనాన్ని గ్రౌండ్‌లోకి తీసుకెళ్లి పక్కన కూర్చొని డ్రైవింగ్ చేస్తూ మెళకువలు నేర్పుతారు. వారం పాటు ఇలా మెళకువలు నేర్పిన తరువాత రెండో వారంలో కారు స్టీరింగ్ చేతికి ఇస్తారు. స్టీరింగ్ కంట్రోల్, వేగం పరిమితి, వెడల్పు పరిమితి, ఎత్తు పరిమితి, పొడవు పరిమితి, దారి వదలడం తదితర అంశాల గురించి తెలుపుతూ వాహనం చేతికి ఇస్తారు. మూడో వారం నుంచి రోజు రెండు మూడు కిలోమీటర్లు డ్రైవింగ్ చేయిస్తూ పక్కనుంచి పర్యవేక్షిస్తారు. నాలుగోవారంలో నేర్చుకునే వ్యక్తి సరైన విధంగా డ్రైవింగ్ చేసేలా చూస్తారు.

ఫీజుల వివరాలు ఇలా..

ద్విచక్రవాహనానికి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఇందుకు ఫీజు రూ.వెయ్యి నుంచి 1500 తీసుకుంటున్నారు. కారు డ్రైవింగ్ మాత్రం 45రోజులు శిక్షణ ఇస్తారు. పలు రకాల కార్లపై శిక్షణ ఇస్తారు. యువత ఆసక్తి, సమయం, డ్రైవింగ్ దూరం బట్టి ఫీజు రూ. 3 వేల నుంచి రూ. 3500 వరకు తీసుకుంటారు. ఒక్కొక్క అభ్యర్థి రోజు పది కిలోమీటర్ల వరకు కారు డ్రైవింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక్కొక్క శిక్షణార్థుడి వద్ద రూ. 3500 వరకు తీసుకుంటున్నారు.

కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నా..



నాకు ఎంటెక్ పూర్తి చేసిన తరువాత విదేశాల్లో ఉద్యోగం చేయాలని ఉంది. ఉద్యోగానికి వెళ్లాలంటే కారు డ్రైవింగ్ తప్పనిసరి. అందుకోసం శిక్షణ తీసుకుంటున్నా.

- శ్రీరాం జాహ్నవి, శివనగర్ విద్యార్థి

కారు నడపడమంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి కారు నడపడమంటే ఇష్టం. ఈ విషయం మా నాన్న, నా భర్తకు చెప్పా. డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకొమ్మని చెప్పారు. వెంటనే డ్రైవింగ్ స్కూల్‌లో చేరా.. ప్రస్తుతం వారం రోజులవుతోంది. కారు డ్రైవింగ్ నేర్చుకోవడం సంతోషంగా ఉంది.

- కవిత, హనుమకొండ

కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది



నా భర్త వ్యాపారి. సాయంత్రం వరకు షాపులోనే ఉంటారు. నాకు ఇద్దరు పిల్లలు. వారిని పాఠశాలకు తీసుకెళ్లడం, మళ్లీ తీసుకు రావడం నాదే బాధ్యత.. ఇంట్లో సామగ్రి, ఇతర వస్తువులు కొనడానికి ఇబ్బంది ఉండేది. కారు ఉంది.. కానీ డ్రైవింగ్ రాదు. దీంతో కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. ముందు నేను స్కూటీ డ్రైవింగ్ నేర్చుకున్నా. ఆ తరువాత కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నా.

- మాధురిరెడ్డి, రంగశాయిపేట, వరంగల్

నాణ్యమైన శిక్షణ ఇస్తాం..



వరంగల్, హనుమకొండలో మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశా. కారుపై నైపుణ్యం, అనుభవం ఉన్న డ్రైవర్‌తో శిక్షణ ఇస్తున్నాం. ప్రాక్టికల్, డ్రైవింగ్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులతో నాణ్యమైన డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నాం.

- సీహెచ్ కృష్ణ, మోటార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు

ఉత్తీర్ణత సాధించిన వారికే లైసెన్స్

డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన తర్వాత లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఆర్టీఏలో నిర్వహించే డ్రైవింగ్ టెస్ట్‌లో సులభంగా ఉత్తీర్ణత పొందుతున్నారు. డ్రైవింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికే లైసెన్స్‌లు అందజేస్తున్నాం.

- జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, ఆర్టీఏ వరంగల్

భద్రకాళి అమ్మవారికి భద్ర పీఠ సేవ



అమ్మవారికి అశ్వ వాహన సేవ



భద్రపీఠ సేవపై భద్రకాళి అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న భద్రకాళి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం మహాష్టమి దుర్గాష్టమి భద్రకాళీ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని భద్రకాళి మహా దుర్గాలంకారవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహా గౌరీ క్రమంలో పూజలు నిర్వహించారు. భద్రపీఠసేవ నిర్వహించారు. సాయంత్రం నిశుంభహా క్రమంలో అర్చన జరిపి ఆశ్వ వాహనసేవ నిర్వహించారు. రాత్రి డోలోత్సవం నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శేషభారతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గాదేవిగా రుద్రేశ్వరీ అమ్మవారు



అనుగ్రహ భాషణం చేస్తున్న గోవిందానందస్వామి

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకాలు, రుద్రార్చనలు నిర్వహించారు. రుద్రేశ్వరీ ఉత్సవమూర్తికి మహాగౌరీ దుర్గార్చన జరిపి అనంతరం ఉత్సవ విగ్రహానికి చతుషష్టి ఉపచార పూజలు చేశారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి పల్లకిసేవ నిర్వహించారు.

గోవిందానందస్వామి ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మిక గురువు, హంపీ విరూపాక్ష సంస్థాన ప్రవచకులు గోవిందానందస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. యాగశాలలో మహా చండీయాగం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ వెంకటయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాదుర్గ గౌరీ అలంకరణలో భ్రమరాంబిక

ఐనవోలు: దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు మహాదుర్గ గౌరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలంకారాలను భక్తులు ద ర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావా లని ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు కోరారు. కార్యక్రమంలో వేదపండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ, పాతర్లపాటి నరేశ్ శర్మ, నందనం మధుశర్మ, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మహాదుర్గ గౌరీ అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు

అండర్-15 చెస్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22, 23వ తేదీల్లో అండర్-15 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన కరపత్రాలను గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆవిష్కరించారు. పోటీలు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మంటపంలో జరగనున్నట్లు వెల్లడించారు. జనవరి 01, 2009న, ఆ తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 90595 22986 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ కోశాధికారి సీహెచ్ రవీందర్, అంతర్జాతీయ ఆర్బిటర్లు చంద్రమౌళి, శ్రీరామ్, వరంగల్ సత్సంగం ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాస్, ప్రేమసాగర్, ఆర్బిటర్ సాయిప్రదీప్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు 27మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల ప్రతిపాదనలు పంపామన్నారు. పీఎం విశ్వకర్మ, టీ ప్రైడ్ వంటి పథకాల ద్వారా యువత వ్యాపార రంగాల్లో ప్రవేశించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేష్ పాల్గొన్నారు.

అగ్గిపడితే బుగ్గే..

మానుకోటలో కాలంచెల్లిన అగ్నిమాపక వాహనం

- పలుమార్లు మొరాయించిన ఫైరింజన్
- ప్రమాద స్థలికి సరైన సమయంలో వెళ్లకపోవడంతో నష్టం
- ప్రతిపాదనలకే పరిమితమైన నూతన ఫైరింజన్
- వెంటాడుతున్న సిబ్బంది కొరత

మహబూబాబాద్: జిల్లా అగ్నిమాపక శాఖలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలో మూడు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కాలం చెల్లిన ఫైరింజన్, సొంత భవనాలు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో కాలంచెల్లిన ఫైరింజన్‌ను వినియోగిస్తున్నారు. పలుమార్లు మొరాయించినా.. గత్యంతరం లేక మరమ్మతులు చేపట్టి వాడుతున్నారు. ఇటీవల మానుకోట పట్టణంలో అగ్నిప్రమాదం జరగగా.. ఫైరింజన్‌లో చిన్న సమస్య వల్ల ఆస్తినష్టం భారీగా పెరిగింది. కాగా నూతన అగ్నిమాపక వాహనం కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది.

జిల్లాలో మూడు కేంద్రాలు..

జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం పరిధిలో మానుకోట, కేసముద్రం, బయ్యారం, ఇనుగుర్తి, గూడూరు, నెల్లికుదురు, కురవి, కొత్తగూడ, గంగారం మండలాలు ఉన్నాయి. కేంద్రంలో అగ్నిమాపక అధికారి(ఎస్ఎఫ్ఓ), ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఆర్టీసీకి చెందిన ఇద్దరు డ్రైవర్లు(డిప్యుటేషన్), ఇద్దరు ఫైర్‌మెన్లు, ముగ్గురు హోంగార్డులు పని చేస్తున్నారు. 16 మందికి గాను 10 మంది మాత్రమే పని చేస్తున్నారు. సంప్, ఫైరింజన్, మిస్ట్ బుల్లెట్‌తో పాటు మరో వాహనం ఉంది. మరిపెడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అగ్నిమాపక కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో ఏడుగురు పని చేస్తున్నారు. దీని పరిధిలో మరిపెడ, చిన్నగూడూరు, దంతాలపల్లి, తొర్రూరు, నర్సింహులపేట మండలాలు ఉన్నాయి. ఫైరింజన్ బాగానే ఉన్నా.. సంప్, సొంత భవనం లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. డోర్నకల్‌లోని అగ్నిమాపక కేంద్రం బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ భవనంలో కొనసాగుతోంది. ఇద్దరు ఎల్ఎఫ్‌లు, ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు(డిప్యుటేషన్), ఇద్దరు ఫైర్‌మెన్లు(డిప్యుటేషన్), ఇద్దరు హోంగార్డులు పని చేస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో డోర్నకల్, సీరోలు మండలాలు ఉన్నాయి.

జిల్లా కేంద్రంలో కాలం చెల్లిన వాహనం..

జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక వాహనం కొనుగోలు చేసి 15 సంవత్సరాలు దాటింది. దాని కాల పరిమితి ముగిసింది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా లేదు. పలుమార్లు మరమ్మతులకు గురైంది. నూతన వాహనం కోసం రీజినల్ ఫైర్ ఆఫీసర్‌కు మూడుసార్లు ప్రతిపాదనలు పంపినట్లు సిబ్బంది తెలిపారు. కానీ నేటికీ వాహనం మంజూరు కాలేదు. కాగా మరమ్మతులతో పాటు ఎక్కడ ఆగిపోతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఆ వాహనం ఆగిపోతే మరో వాహనం వచ్చే లోపు పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరిగే పరిస్థితి ఉంది.

ఇటీవల ఆస్తినష్టం..



జిల్లా కేంద్రంలోని ఎస్వీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో ఈనెల 8న విద్యుత్ ప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగానే వెంటనే అక్కడి వెళ్లినప్పటికీ కాలం చెల్లిన వాహనంలోని నీటి సరఫరా యంత్రం మొరాయించింది. దీంతో ఆ ప్రాంతంలోని ప్రజలు, అపార్ట్‌మెంట్ వాసులు అప్రమత్తమై బకెట్లు, పైపులతో చాలా వరకు మంటలను ఆర్పారు. ఆ తర్వాత డోర్నకల్, మరిపెడ నుంచి వాహనాలు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదంలో 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఇతర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. నీటి సరఫరా యంత్రం పనిచేయకపోవడం వల్లే పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులకు నూతన వాహనం ఏర్పాటు చేయాలని వినతిపత్రం సైతం అందజేశారు.



జిల్లా కేంద్రంలోని అగ్ని మాపక కేంద్రం



కాలంచెల్లిన అగ్నిమాపక వాహనం ఇదే

నూతన ఫైరింజన్ కోసం ప్రతిపాదనలు పంపాం

కొత్త ఫైరింజన్ కోసం మూడుసార్లు ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాకపోవడంతోనే ఉన్న వాహనాన్ని వినియోగిస్తున్నాం. శాఖకు చెందిన డ్రైవర్లు లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ డ్రైవర్లు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. వారికి ఆ వాహనంపై అవగాహన లేదు. ఈనెల 8న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన సమయంలో వాహనంలో చిన్న సమస్య తలెత్తింది. దానిని డ్రైవర్ గుర్తించలేదు. ప్రస్తుతం వాహన మరమ్మతులు చేయించాం. త్వరలోనే నూతన వాహనం మంజూరు అవుతుంది.

- నాగేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఓ

దళితులకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదు


- రిటైర్డ్ అడిషనల్ డీజీపీ డాక్టర్ బాబురావు




మాట్లాడుతున్న రిటైర్డ్ అదనపు డీజీపీ బాబురావు

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో 1950, ఆగస్టు 10న రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డర్ రాజ్యాంగంలోని మౌలిక లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని, తద్వారా నేటికి దళితులు రాజ్యాంగ ఫలాలను పొందలేకపోతున్నారని రిటైర్డ్ అడిషనల్ డీజీపీ డాక్టర్ బాబురావు అన్నారు. రిలీజియస్ ఫ్రీడమ్ ఫర్ దళిత్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని సీబీసీలో 'దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడం' అనే అంశంపై జరిగిన సదస్సుకు బాబురావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ నియామకాల్లో మతం, కులం, జాతి జన్మస్థానం వంటి అంశాలను ఆధారంగా నియామకాలను నిరాకరించరాదని రాజ్యాంగం స్పష్టం చేస్తోందన్నారు. హిందూ మతం కాకుండా ఇతర మతాలను అనుసరించే దళితులను షెడ్యూల్డ్ కులంగా గుర్తించరాదని 1950 ఆర్డర్ పేర్కొంటూ బ్రిటీష్ పాలన సూత్రాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్డర్ ద్వారా దళితులను మత ప్రాతిపదికన వేరు చేసి విభజనలు సృష్టించడం దేశానికి మంచిది కాదన్నారు. 1950లో తెచ్చిన రాష్ట్రపతి ఆర్డర్‌ను తక్షణమే రద్దు చేయాలని, దళితులకు మత స్వేచ్ఛను కల్పించి ఉద్యోగ నియామకాలు, విద్య, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నగరంలోని బిషప్‌లు, సంఘ ప్రముఖులు, రాజకీయ విశ్లేషకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాగరణ పూజ





దాండియా నృత్యం చేస్తున్న మార్వాడీలు, మార్వాడీలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని మహేశ్వరి భవన్‌లో గురువారం రాత్రి దాండియా నృత్యాలు, జాగరణ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్-ఉమా, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్-సీతామహాలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. మార్వాడీలతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మార్వాడీ సమాజ్, మార్వాడీ యువమంచ్, సఖీ మండలి సభ్యులు పాల్గొన్నారు.